# కొత్త కులాలు

"ఒరేయ్ ఉదయ్! చెల్లెల్ని తీసుకెళ్ళి బయటాడుకో... కొట్లాడితే ఇద్దరి ఒళ్ళు చీరేస్తా..." పిల్లలు తిన్న టిఫిన్ ప్లేట్లు, బోర్నవిటా కప్పులు సింక్‌లో పడేస్తూ అంది లక్ష్మి.

"మాకు స్నానం చేయించి బట్టలు మార్చమ్మా...! బయటకెళ్ళి ఆడుకుంటాం... ఇవ్వాళ్ళ ఆదివారమే కదా!" అన్నాడు ఎనిమిదేళ్ళ ఉదయ్...

"మనం మధ్యాహ్నం పార్టీ కెళ్ళాలి. పని తీరింతరువాత స్నానం చేయించి మంచి బట్టలు వేస్తాను. ఇప్పుడే బట్టలు మార్చితే మాపుకుంటారు. అసలే చిచ్చర పిడుగులు... వెళ్ళి ఆడుకోండి..." అరుస్తూ అంది లక్ష్మి.

"ఎవరింటికమ్మా పార్టీకి? అక్కడన్నం పెడతారా? స్వీటిస్తారా?" తల్లి దగ్గరికి వస్తూ అడిగింది కవిత.

"సవాలక్ష ప్రశ్నలూ మీరూనూ... ఏదోటి పెడతారు. వెళ్ళి ఆడుకోండి, నాకు చాలా పనుంది..." కసిరినట్టంది లక్ష్మి.

ముఖం ముడుచుకొని పిల్లలు బయటకు వెళ్ళారు.

పనిమనిషికి బుద్ధి లేదు... పదయినా యింకా రాలేదు. పార్టీకి వెళ్ళాలి, తొందరగా రమ్మని చిలక్కు చెప్పినట్టు చెప్పినా రాలేదు. కృతజ్ఞతలేని ముండలు. వీళ్ళకెంత పెట్టినా ఇంతే. తట్టెడు తట్టెడు తింటారు గాని, పనంటే ఏడుస్తారు... ఇదెప్పుడు రావాలి...? పనెప్పుడవ్వాలి? మార్కెట్ నుంచి ఆయనగా రొచ్చారంటే ఇంకా పని కాలేదా అని గోలచేస్తారు... గొణిగినట్టుగా పైకే అంటూ పనిమనిషి కృతఘ్నతను గూర్చి తిడుతూ, డీ ఫ్రిజ్ సెక్షన్‌లో గడ్డకట్టిన ఐస్ ముక్కలను తీసింది లక్ష్మి...

ఆదివారం ఇంట్లో ఉన్నా కొంచెమన్నా సాయం చేయడు... ఆయన పేపరేందో, పుస్తకాలేందో...? ఆయనలోక మాయనదే... గడుగ్గాయి పిల్లలతో వేగలేక చస్తున్న... పనిమనిమనిషున్నట్టే కాని సగానికెక్కువ పని చేసుకోవడమేనాయె... అది చేసేప్పుడైనా వెంబడుండాలి... లేకుంటే సరిగ్గా పన్జెయ్యదు... దీనికా బుద్ధులేం లెవ్వుకాని రెడ్డిగారి పనిమనిషి చెంచాలు ఎత్తుకుపోయిందట... అయినా, పనివాళ్ళను నమ్మొద్దు... ఆయనకేం తెలుసు, అందర్నీ నెత్తికెక్కించుకోమంటారు...తనలో తాను గొణుక్కుంటూ చెమట కారుతుండగా కొంగు నడుముకు బిగించి ఫ్రిజ్ క్లీన్ చేస్తోంది లక్ష్మి...

"ఏమోయ్ పనయిపోయిందా...? ఇంకా స్నానమే చెయ్యనట్టున్నావు గదా...!" కూరగాయల సంచితో ఇంట్లోకొస్తూ అన్నాడు నారాయణ...

"వచ్చేసారా...? ఇంకో గంటాగి వస్తేంబొయ్యేది...? పార్టీటైంవరకెళ్లాం కాని, మీరు తొందరపెట్టకండి... చెయ్యబుద్ధయితే నాకు సాయం చెయ్యండి, లేదా పేపర్ చూస్తూ గడపండి..." సంచీ తీసుకుంటూ అంది లక్ష్మి.

"నాన్నొచ్చిండు... నాన్నొచ్చిండు..." అంటూ లోపలికొచ్చారు పిల్లలిద్దరు...

"మాకేం తెచ్చావు నాన్నా, మార్కెట్ నుంచి..." అన్నాడు ఉదయ్...

"తెచ్చాడు రసాల మామిడిపళ్ళు... బంగనపల్లి తెమ్మంటే ఎప్పుడూ రసాలే తెస్తాడు..." అని చెరో మామిడి పండు పిల్లల చేతికిచ్చింది లక్ష్మి...వాట్ని పట్టుకొని బయటకెళ్ళారు పిల్లలు...

సంచి టేబుల్ పై పెట్టి కారుతున్న చెమటలను తుడుచుకుంటూ ఫ్రిజ్ లో బాటిల్స్ పెడుతున్న లక్ష్మిని చూస్తూ నిల్చున్నాడు నారాయణ.

"అలా చూస్తూ నిలబడకపోతే కొంచెం సాయం చేస్తే తప్పా...?"

"చేస్తానోయ్, నేను కాకుంటే ఎవరు సాయం చేస్తారు నీకు...? ఇప్పుడు నువ్వెలా ఉన్నావో తెలుసా...? ఒక్కసారి గోచీ పెట్టు... చూద్దాం...పల్లెటూరి పడచులా...వనకన్యలా... నండూరి ఎంకిలా... విశ్వనాథ కిన్నెరసానిలా... ఇంకా...ఇంకా... మాటలు దొరకడంలేదు నిన్ను వర్ణించడానికి..." అని దగ్గరకు పోయాడు నారాయణ...

"ఎప్పుడు పల్లె బుద్ధులు... పల్లె పోలికలు... ఎంత చదివినా ఆ పల్లెటూరి బుద్ధులేడికి పోతాయి...?" అంది లక్ష్మి.

"అయితే, సినిమా యాక్టర్లతో పోలుస్తాను చూడు... అచ్చం విజయశాంతిలా, చేరడేసి కన్నులతో భానుప్రియలా ఉన్నావు నీవు..."

"సంబడం చాలుగాని బాటిల్స్ తుడుస్తూ ఇవ్వండి..."

"నిన్ను చూస్తే ముద్దొస్తుంది... చెమటకంపుతో మరీ ముద్దుగున్నావు..." అని లక్ష్మిని కౌగిట్లోకి తీసుకోబోయాడు నారాయణ...

"మీకేమన్న సిగ్గుందా...? వయసు మీదపడుతున్న కొద్దీ పడుచుతనం మొస్తున్నట్టుంది... మీరు సాయం చెయ్యక్కర్లేదు కాని, వెళ్ళండి..." దూరం జరుగుతూ అంది లక్ష్మి.

"సరే" అంటూ ముందురూంలో కెళ్ళబోయాడు నారాయణ... టేబుల్ మీదున్న చలన్నం, ఉప్మా చూశాడు... వాటిమీద దోమలు వాలుతున్నాయి...

"వాటిమీద మూతపెట్టకపోయావా...?" కోపంగా అన్నాడు నారాయణ.

"అవి పనిమనిషికండీ..." అంది పని చేసుకుంటూనే లక్ష్మి.

"పనిమనిషికైతే మాత్రం అంత నిర్లక్ష్యంగా పారెయ్యాలా...? అది మాత్రం మనిషి కాదా...? పురుగులు, ఈగలు వాలిన తిండి తింటే దానికి రోగాలు రావా...? దాని కెవరు బాధ్యులు...? నీ కెన్నిసార్లు చెప్పాను...? నీకింత తేడాలెందుకు...?

ఇదువరకోసారి పారెయ్యాల్సిన గట్టిపడిన అరిసెలిస్తే తిని పనిమనిషికి కడుపునొప్పి లేచింది. ఈ అన్నం తింటే కలరా వస్తే ఏం చేస్తావు...? అందరివీ ప్రాణాలే అనుకోవాలి...?" అన్నాడు కళ్ళెర్రజేస్తూ నారాయణ...

"మీకన్నీ విషయాలు కావాలి... అందరి విషయాలు కావాలి.... అయితే, పనిమనిషికి చలన్నం పెట్టొద్దా...?" అంది లక్ష్మి.

"అని ఎవరన్నారు...? కాని, అది మనం తినేట్టుగా ఉంటేనే పెట్టు... వాటిపై మూతలుంచు... దోమలు, పురుగులు వాలిన ఆ అన్నాన్ని మనం తినగలమా...? మన పిల్లలకు పెట్టగలమా...?"

"నాకేం కర్మ పట్టింది...? నా పిల్లలకేం గతి పట్టింది అది తినడానికి...? మీవి చిన్న బుద్ధులు, చిన్న ఆలోచనలు... మనకు పనిమనిషితో పోలికేంటి...? ఏమన్నంటే సంస్కారమంటారు సమానత్వమంటారు... బొగ్గు బావిలో పన్జేసేవాన్ని తీసుకొచ్చి డైనింగ్ టేబుల్ మీద వడ్డించమంటారు... కూలిపనోన్ని తీసుకొచ్చి మనం తినే కంచంలో అన్నం పెట్టమంటారు... ఫ్యూన్ను తీసుకొచ్చి సోఫాలో కూర్చోమంటారు... పిల్లలు పనిమనుషుల పిల్లలతో ఆడితే చూస్తూ ఊర్కుంటారు... మీకు పెద్ద పెద్ద చదువులైతే ఉన్నాయి కాని ఎవరితో ఎలా మెలగాలో తెలియదు. ఎక్కడుండే వాళ్ళనక్కన్నే ఉంచాలి. అందరికీ అలుసిస్తే మీదికెక్కి కూర్చుంటారు..." అంది కూరగాయలు ఫ్రిజ్‌లో సర్దుతూ లక్ష్మి.

"లక్ష్మి! నీకెంత చెప్పినా అర్థంకాదు... సరే... నువ్వు స్నేహాలు, మర్యాదలు హోదానుబట్టే చెయ్యి కాని, పిల్లలకిప్పట్నుంచే ఆ భేదాలు బోధించకు..." అన్నాడు నారాయణ...

"మీతో వేగడం కష్టంకాని, మీరెళ్ళి ముందు రూంలో కూర్చోండి... నేను పని చేసుకోవాలి... పనిమనిషి ముండింకా రాలేదు..." అని తన పనిలో నిమగ్నురాలయింది లక్ష్మి...

నారాయణ ముందు రూంలోకి వెళ్ళిపోయాడు...

మరికొద్ది నిమిషాల్లో పనిమనిషొచ్చింది...

"ఇంత లేటయితే ఎలా...? పార్టీ కెళ్ళాలి, తొందరగా రమ్మన్నానా లేదా...?" పని మనిషిమీదకి లేచింది లక్ష్మి...

"నేనేం జెయ్యాలమ్మా...? ఆ యమ్మ ఇడిసిపెడితేనా...?" అంది పనిమనిషి...

"సరేగాని ఈ అన్నం, ఉప్మాదిని తొందరగా పనిగానియ్యి..." అని టేబుల్ మీదున్న అన్నం, ఉప్మా గిన్నెలు ఆమె చేతికిచ్చింది లక్ష్మి...

"కొద్దిగంత మూతపెట్టక పెయినవమ్మ... దోమలాలుతున్నాయి..."

"సర్లే... నాకే చెపుతున్నావా...?" కసురుకుంది లక్ష్మి...

వాట్నే తిని అంట్లుతోమి, ఇల్లు తుడిచి బట్టలుతికింది పనిమనిషి... పిల్లలకు స్నానాలు చేయించి బట్టలేసింది లక్ష్మి. తను స్నానం చేసి పట్టుచీర కట్టుకుంది.

"ఏమండీ... మీరు డ్రెస్ చేసుకోరా...?" భర్తను కేకేసింది.

"డ్రెస్ వేసుకునే ఉన్నాను కదోయ్..." బెడ్ రూంలో కొస్తూ అన్నాడు నారాయణ.

"సఫారి వేసుకోండి, అది బాగాలేదు..." అంది లక్ష్మి.

"ఆయన ఆఫీసర్ డైరక్టర్‌గా ప్రమోషనొచ్చినందుకు పార్టీ ఇస్తున్నాడు. నేను హెడ్ క్లర్కును... నేను కూడా సఫారీ వేసుకోవడం ఏం బాగుంటుంది...? ఆయనదే వేసుకుంటారు..." అన్నాడు నారాయణ.

" మీ డ్రెస్ మీరేసుకుంటే ఆయనకేంటి...? వేసుకోండి..." అంది లక్ష్మి.

"సరేగాని నువ్వు పట్టుచీరలో ముద్దొస్తున్నావోయ్..." డ్రెస్ మార్చుకుంటూ అన్నాడు నారాయణ.

అంతా తయారయ్యేసరికి మధ్యాహ్నం 12.30 అయింది. ఇంటికి తాళంవేసి బయటికెళ్ళారు. స్కూటర్ స్టార్ట్ చేశాడు నారాయణ. ఆఫీసర్ గారింటికెళ్ళేసరికి అందరూ వస్తున్నారు. కార్లు, స్కూటర్లు, జీపులు రోడ్డుప్రక్కన పార్కు చేసున్నాయి. హల్లో హల్లోలు, హాయ్ హాయ్‌లు, నవ్వులు కేరింతలు... పట్టుచీరల పరపరలతో హాలంతా సందడిగా వుంది. ఆడవాళ్ళంతా ఒక్క దిక్కు మగవాళ్ళంతా ఒక దిక్కు గుంపులు గుంపులుగా ఉన్నారు. కొద్దిసేపట్లో గ్రాండ్‌గా లంచ్ పూర్తయింది. మరో గంటలో ఎక్కడి వాళ్ళక్కడ వెళ్ళిపోయారు.

భార్యా పిల్లలను తీసుకొని ఇంటికెళ్లాడు నారాయణ... భార్య ముఖం వాడిపోయుండటం చూసి త్రోవలో ఏం మాట్లాడలేదు... ఇంటి కొచ్చింతర్వాత అనునయంగా లక్ష్మిపై చెయ్యేశాడు...

"పార్టీ గ్రాండ్‌గా జరిగింది కదూ..." అన్నాడు నారాయణ... లక్ష్మి ఏం మాట్లాడలేదు... ఆమె కడుపునిండా దుఃఖముంది...

"ఏంటోయ్...? ఏం జరిగింది...? ఎలాగో ఉన్నావేంటి...?"

"నన్నెందుకు తీసుకుపోయారా పార్టీకి... మీ ఆఫీసరయితే మీరుపోతే సరిపోయేదిగా...!" అంది లక్ష్మి...

"ఏం జరిగిందసలు...? ఎందుకలా ఉన్నావు...?"

"ఆఫీసర్లయితే ఆఫీసర్లనే పిలుచుకోవాలి...? మమ్మల్నెందుకు పిలవాలి...? ఎందుకవమానించాలి...?" లక్ష్మి కనుకొలుకుల్నుంచి రెండు కన్నీటిబొట్లు రాలాయి... అవమానభారంతో తల కుంచించుకుపోతోంది...

లక్ష్మి చాలా అప్‌సెటయినట్టు గ్రహించాడు నారాయణ...

ఆమెను దగ్గరకు తీసుకొని "ఏమైంది చెప్పు...?" అన్నాడు.

"వాళ్ళకు టెక్కెక్కువ... ఆఫీసర్లని గర్వం... మేము వాళ్ళకండ్లకు కనబడలేదు... నన్ను చూసీ చూడనట్టుంది ఆఫీసర్ భార్య... నేను దగ్గరికెళ్ళి మాట్లాడినా అంటీ ముట్టనట్టు మాట్లాడింది... నాతో మాట్లాడటమే తన హోదాకు తక్కువైనట్టు ప్రవర్తించింది... ఇతర ఆఫీసర్ల భార్యలతో రాసుకు రాసుకు తిరిగింది... కార్లున్నాయని,

పెద్దోల్లమని పొగరు... ఈమె కార్లెపరైనా ఇవ్వమంటారా...?" కోపంగా అంది లక్ష్మి...

తనకెంతో అవమానం జరిగినట్టుగా ఫీలవుతుందామె...

"మముల్ని అంటరాని వాళ్ళన్నట్టుగా చూశారు. పిల్లలు సోఫాలెక్కితే పాడవుతాయని గద్దరించారు. .. టీపాయ్ ముడితే మరకలైతాయని బెదరించారు... అదే వాళ్ళ పిల్లలేం చేసినా ఏమన్లేదు... ఆఫీసర్ల భార్యలకు కొసరి కొసరి వడ్డిస్తే మమ్మల్ని తినమన్నవాళ్ళే లేరు. పోగా చిన్న ఉద్యోగులు, వాళ్ళ భార్యాపిల్లలు ఇటువంటి పార్టీల్లో మొహం వాచినట్టు తింటారని మమ్ములను చూస్తూ చెవులు కొరుక్కున్నారు..." కనుగుడ్లనిండా నీళ్ళతో అంది లక్ష్మి...

ఆమె ముఖం వర్షించే మేఘంలా ఉంది...

భార్య తలపై చెయ్యేసి ప్రేమగా నిమురుతూ దగ్గరకు తీసుకున్నాడు నారాయణ...

"నన్నీసారి ఇలాంటి పార్టీలకెపుడూ తీసుకెళ్ళకండి..." అంది లక్ష్మి...

'సరే' నన్నాడు నారాయణ.

"లక్ష్మి! స్కూటర్లున్న మనలాంటి వాళ్ళకు సైకిళ్ళ వాళ్లు, కాలినడకవాళ్ళు హీనంగా కనబడ్డారు... కార్లున్నవాళ్ళకు మనం అలాగే కనబడతాం... అలాగే గాల్లోనే ప్రయాణం చేసే వాళ్ళకు కార్లున్న వాళ్ళుగపడతారు... డబ్బునుబట్టి, హోదానుబట్టి మనిషి విలువను నిర్ణయించటమున్నంతవరకిదిలాగే కొనసాగుతుంది... నీకు పనిమనుషులు, కూలివాళ్ళు మరీ చిన్న ఉద్యోగు లెలాకనబడ్డారో ఆమెకు నీలాంటి వాళ్ళలాగే కనబడ్డారు..." అనాలనుకున్నాడు నారాయణ...

కాని భార్య ముఖం చూసి అనలేకపోయాడు...

పశ్చాత్తాపంతో పునీతమవుతూ భర్తను పట్టుకొని భోరుభోరున ఏడ్చింది లక్ష్మి... భార్య తలను ఒళ్ళోకి తీసుకొని ఓదార్చాడు నారాయణ...

"లక్ష్మి! మన సమాజంలో అనేక కులాలున్నాయి. వాటికి తోడు కొత్త కులాలు పుడుతున్నాయి... ఆఫీసర్ల కులం, గుమస్తాల కులం... ఎగ్జిక్యూటివ్‌ల కులం, కార్మికుల కులం... యజమాన్ల కులం, పనిమనిషుల కులం... చదువుకున్నోల్ల కులం, చదువురానోళ్ళ కులం... ఖద్దరుబట్టల కులం, తెల్లబట్టల కులం, నల్లబట్టల కులం... పట్నపోల్ల కులం... పల్లె కులం... కార్ల కులం...స్కూటర్ల కులం... సైకిళ్ళ కులం... కాలినడక కులం... ఉన్నోళ్ళ కులం, లేనోళ్ళ కులం - ఇలా ఎన్నో కులాలు పుట్టుకొస్తున్నాయి. దీన్ని అభివృద్ధనా..., ఏమనాలో తెలియటం లేదు. అనాలనుకున్నాడు... కాని, అవమాన భారంతో బాధపడ్తున్న ఆమె అప్పుడా మాటలనర్థం చేసుకోలేదని ఊర్కున్నాడు...

"లక్ష్మి! వాళ్ళు చేసింది తప్పే...! కాని, ఇతర్లను విమర్శించేముందు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆత్మవిమర్శ చేసుకునే అలవాటున్న మనిషి తప్పులు చేసే అవకాశాలు చాలా తక్కువ..." అని ఆమెను తీసుకెళ్ళి బెడ్‌రూంలో పడుకోబెట్టాడు నారాయణ...

● 'ఈనాడు' ఆదివారం, 5-4-92 ●